## అల్లసాని పెద్దన్న విగ్రహం ఏర్పాటు

**యఱ్ఱగుంట్ల జనవరి 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలో గల పెద్దన పాడు శివాలయం వద్ద ఈనెల 12 వ తేదీ ఆంధ్ర పితామహుడు అల్లసాని పెద్దన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు కావున ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

## అచ్చు తప్పు సవరణ హర్షణీయం

**ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 10,ప్రభాత వార్త:**
కుంటి మల్లారెడ్డి కులం పేరు లో అచ్చు తప్పును సవరిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం హర్షణీయమని జాతీయ కుంటి మల్లారెడ్డి సేవా సంఘం తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు కత్తి వెంకట సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ జారీ చేసిన ఉత్తర్వులలో కుంటి మల్లారెడ్డి కులం పేరును కునిటి మల్లారెడ్డిగా అచ్చు తప్పుగా పేర్కొన్నారని, ఈ పొరపాటును సవరించాల్సిందిగా తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం కుంటి మల్లారెడ్డిగా సవరిస్తూ జీవో విడుదల చేసిందని, దీనికి సహకరించిన కూటమి ప్రభుత్వానికి, అధికారులు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 43 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు

**దువ్వూరు, జనవరి 10, ప్రభాతవార్త:**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శనివారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమం క్రింద 43 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్లు సురేష్ బాబు, హేమలత, రోషినీలు తెలిపారు. వీరిలో 24 మంది కష్టతరమైన గర్భిణీలు ఉన్నట్లు గుర్తించామని, వీరికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భవతులు అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సలహాలు సూచనలు అందజేశారు. ఎత్తు, బరువు, గ్రోతింగ్, రక్త పరీక్షలు, యూరిన్, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న గర్భిణీలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగే విధంగా చూడాలని, అలా జరిగితే జననీ సురక్ష జననీ శిశు సంరక్షణ కార్యక్రమాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శాంతకుమారి, రాజగోపాల్, విజయకుమారి, బయన్న పాల్గొన్నారు.

## మండలంలో 1960 పాస్‌బుక్‌లు పంపిణీ

**దువ్వూరు, జనవరి 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రీ సర్వే జరిగిన గ్రామాలలో శనివారం నాటికి 1960 ఈ పాస్ బుక్ ల పంపిణి చేసినట్లు తహసీల్దార్ సంజీవరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో ఆయన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో మొత్తం 2941 పాస్ బుక్కులు రాగా ఇంతవరకు 1960 పంపిణీ చేశామన్నారు. మిగతావి రెండు, మూడు రోజుల్లో పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన పట్టాదారు ఈ పాస్ బుక్కుల వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అద్దెదారుడు యజమాని కాజాలడు

(యజమానుల ఆస్తి హక్కులు కాపాడుతూ సుప్రీం కోర్టు కీలక తీర్పు )

**బద్వేలు లీగల్, జనవరి 10 ప్రభాతవార్త:**
అద్దెకు తీసుకున్న ఇంట్లో ఎంత కాలము నివాసమున్నా, కాపురం చేసినా అది 5 సంవత్సరాలు లేదా 12 సంవత్సరాలు అయినా ఏ అద్దెదారుడు కూడా ప్రతికూల స్వాధీనము ద్వారా (అడ్వర్స్ పొసెషన్) ఆ ఆస్తిపై యాజమాన్యపు హక్కును లేదా యాజమాన్యాన్ని క్లెయిం చేయలేడని సుస్పష్టం చేస్తూ యజమానుల ఆస్తి హక్కులను కాపాడుతూ సుప్రీం కోర్టు ధర్మాసనం ఓ సంచలనాత్మక తీర్పును వెలువరించింది. సంవత్సరాల తరబడి ఇంటి యజమానులు మరియు అద్దెదారుల మధ్య ఉన్న గందరగోళం, వివాదాలకు ముగింపు పలుకుతూ జ్యోతి శర్మ ఎదిరి విష్ణు గోయల్ వ్యాజ్యములో ధర్మాసనం ఈ తీర్పును ప్రకటించింది. "లిమిటేషన్ ఆక్ట - 1963 ప్రకారము ఏకధాటిగా 12 సంవత్సరములు ఒకే ఇంట్లో ఉంటే ఆ ఆస్తిని స్వాధీనము చేసుకోవచ్చు". అందుకే కొందరు తమ అద్దె దారులను (టెనెంట్లు) ఎక్కువ కాలము ఇంట్లో అద్దెకు ఉండనివ్వరు. ఈ క్రమములోనే సుప్రీం కోర్టు ధర్మాసనం పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశీలించి యజమానుల హక్కులను కాపాడుతూ ఈ కీలక తీర్పును ఇచ్చింది. అద్దెకున్న ఇంట్లో ఎంత కాలము నివసించినా అద్దెదారునికి ఆ ఆస్తిపై యాజమాన్య హక్కు పొందలేరని సుస్పష్టం చేసింది. ఢిల్లీ కోర్టు మొదట టెనెంటు (బాడుగదారు) వైపున నిలువగా సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ వివాదానికి ముగింపు పలుకుతూ ఏ అద్దె దారుడైనా వారు ఎంతకాలము అక్కడ నివసిస్తున్నారనే దానితో సంబంధం లేకుండా ప్రతికూల స్వాధీనము (అడ్వర్స్ పొసెషన్) ద్వారా అద్దెకు ఉండబడిన ఆస్తిపై యాజమాన్యాన్ని లేదా యాజమాన్యపు హక్కులు క్లెయిం చేయలేరని ధర్మాసనం తీర్పును వెలుబుచ్చుచూ "అద్దె అనేది ఎల్లప్పుడూ యజమాని అనుమతిపై ఆధారపడి ఉంటుందని యాజమాన్యపు హక్కులపై కాదు" అని జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేస్తూ తే. 11-9-2025 దీన ఈ కీలక తీర్పును వెలువరించింది. (శీర్షిక: సివిల్ అప్పీలు...../2025, స్పెషల్ లీవు పిటీషన్(సివిల్) నెం. 29500/2024)

## క్యాంపింగ్‌పై అవగాహన ర్యాలీ

**కలికిరి, జనవరి 10, ప్రభాతవార్త:**

మండలంలోని గుండ్లూరు, మర్రికుంటపల్లె పంచాయతీలలో శనివారం నేషనల్ మిషన్ నేచురల్ ఫామింగ్ ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ క్యాంపింగ్ అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. మర్రికుంటపల్లె పంచాయతీలో ఈ ర్యాలీని స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో ఎఫ్ఎంటీ ఎ.రమాదేవి, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ క్యాంపింగ్‌పై మహిళలు, రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంటీ రాధమ్మ, ఐసీఆర్పీ శశిరేఖ, పీఐసీఆర్పీ సుమలత, షాహీర్‌బాషా, రైతులు, మహిళా సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**కలికిరి, జనవరి 10, ప్రభాతవార్త:**

మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలికిరి సీఐ రామచంద్ర పర్యవేక్షణలో పోలీసులు పంచాయతీల్లోని గ్రామాలకు వెళ్లి ప్రజలకు సూచిస్తున్నారు. పల్లఓలు పంచాయతీలో కానిస్టేబుల్ విజయ్‌కుమార్ గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండగ సందర్భంగా కోడిపందేలు లాంటి కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. గ్రామస్థులు ఎవరైనా పండగలకు బయటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మర్రికుంటపల్లె పంచాయతీలో కానిస్టేబుల్ బాదూషావల్లీ గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎక్కడా పండగ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు చేయరాదన్నారు. అలాంటి కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవన్నారు.

## ఆల్ ఇండియా బార్ పరీక్షలో ఉత్తీర్ణులైన దినేష్ కుమార్ రెడ్డి

**పీలేరు, జనవరి 10 ప్రభాతవార్త:**
ఆల్ ఇండియా బార్ పరీక్షలో పీలేరుకు చెందిన ఝాన్సీ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎం. దినేష్ కుమార్ రెడ్డి ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 7న విడుదలైన ఆల్ ఇండియా బార్ పరీక్షా ఫలితాల్లో దినేష్ కుమార్ రెడ్డి ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణానికి చెందిన పలువురు వైద్యులు, న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలో న్యాయపరమైన సమస్యలకు న్యాయసలహాలు, సూచనలు అందించడానికి ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు.

## అంబేద్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

**సదుం జనవరి 10 ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుద్దాం అని సదుం మండల అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ అధ్యక్షులు మల్లెల గిరి అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవన్లో అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను పరిష్కరించాలని కమిటీ వారి వద్దకు సమస్యలను తీసుకెళ్లాలని చెప్పారు. అంతేకాకుండా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుపై చర్చించారు. ఈ సమావేశంలో అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ గౌరవ అధ్యక్షులు గా లోకనాథం, వై వెంకటస్వామి, గౌరవ సలహాదారుగా చిన్న రెడ్డప్ప, వెంకటరామయ్యలు ఉపాధ్యక్షులుగా శరత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రామానుజులు, సహాయ కార్యదర్శిగా శ్రీరాములు, కోశాధికారిగా ఎం సీతాపతి, లీగల్ అడ్వైజర్ గా మల్లేపల్లి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## నేడు హిందూ మత సమ్మేళనం

**సదుం జనవరి 10 ప్రభాతవార్త**
మండల పరిధిలోని నడిగడ్డ పంచాయతీ మతుకువారిపల్లె శివాలయం వద్ద ఆదివారం ఉదయం 10 గంటల నుంచి హిందూ మత సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు ఇందుకుగాను ఏర్పాట్లు చేసినట్లు ప్రతి హిందువు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## జనవిజ్ఞాన వేదిక కాలమానిని ఆవిష్కరణ




**రాయచోటి డిసెంబర్ 10 ప్రభాతవార్త**
జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని స్థానిక డైట్ ప్రాంగణం నందు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి డా. సుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాదికారి మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పదాన్ని, సమాజంలోని మూఢ నమ్మకాలను రూపుమాపడులో జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందనీయమన్నారు. అనంతరం డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక రూపొందించిన నూతన సంవత్సర సైన్స్ కాలమానినిలో పాలపుంత పుట్టుక, సౌరవ్యవస్థ, వాతావరణం, నీరు, మహా సముద్రాల ఆవిర్భావం, వంటి విషయాలను రంగుల చిత్రాల ద్వారా విద్యార్థులలో విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంపొందించేలా రూపొందించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాష్ రెడ్డి, అన్నమయ్య జిల్లా జెవివి ప్రధాన కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు ఆంజనేయులు, డైట్ అధ్యాపకులు శివభాస్కర్, వైసి రెడ్డప్ప రెడ్డి, ఉపాధ్యాయులు అసదుల్లా బాషా, నాగరాజు, ఉపాధ్యాయసంఘ నాయకులు రవీంద్రనాధరెడ్డి, శివారెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

**పీలేరు, జనవరి 10 ప్రభాతవార్త:**

మండలంలోని తలపుల పంచాయతీ పెద్దహరిజనవాడకు చెందిన దండు ఓబయ్య (55) అన్నమయ్య జిల్లా పోలీస్ విభాగంలో ఏ ఆర్ ఎస్ఐగా విధులు నిర్వహించేవారు. శుక్రవారం ఓబయ్య గుండెపోటుకు గురి కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తక్షణసాయంగా రూ. లక్ష అందజేశారు. ఆర్పి విజె. రామకృష్ణ ఆర్ఎస్ ఐ శ్రీనివాసులు. పోలీస్ సిబ్బంది ప్రభుత్వ లాంచనాలతో గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు చేసి అంతిమ సంస్కరణలు నిర్వహించారు.

## సంక్రాంతికి అనాధ ఆశ్రమానికి పండ్లు పంపిణీ

**కలసపాడు, జనవరి 10 ప్రభాతవార్త:**

మండలంలోని ఉన్నటువంటి అనాధాశ్రమానికి సంక్రాంతి రోజు పండ్లు పంపిణీ చేస్తామని బద్వేల్ నియోజకవర్గం వైయస్సార్ పార్టీ ఐటీ వింగ్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఏదైనా సమస్య వస్తే నా దృష్టికి తెస్తే నేను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చేస్తామన్నారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ



**పోరుమామిళ్ల రూరల్, జనవరి 10 ప్రభాతవార్త:**
పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీలోని ఎస్టీ కాలనీ నందు పొదిలి మహేష్ అనే వ్యక్తి యాక్సిడెంట్ జరిగి మంచానికి పరిమితమై కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని ఆయన భార్య కవిత నియోజకవర్గం ఇంచార్జ్ రితేష్ రెడ్డి దృష్టికి తీసుకెట్టడం జరిగింది. ఆ విషయాన్ని రితేష్ రెడ్డి రంగసంద్రం పంచాయతీ ఎంపీటీసీ , పోరుమామిళ్ల మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కలవకూరి రమణనాయుడు కి సమస్యను చూడమని చెప్పడంతో రితీష్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పొదిలి మహేష్ కుటుంబాన్ని సందర్శించి వారికి నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో షేక్ నాయబ్ కరీముల్లాశ, కేశవ,అన్వర్ భాష,బండి ఓబులేసు, శివకుమార్, గణేష్,నాగేంద్ర, నారాయణ,చెప్పలి సుధాకర్, నాగరాజు,పొదిలి సురేష్, కిరణ్, అరుణ్, శ్రీను, కొండయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఊర్లకు పోయేవారు జాగ్రత్త

**కలసపాడు, జనవరి 10 ప్రభాతవార్త:**
మండల ప్రజలకు సంక్రాంతి పండుగకు గ్రామాలకు వెళ్లేవారు ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని అవి సెల్లు అటాచ్ పెట్టుకోని జాగ్రత్త వహించాలని ఎస్ఐ సుభాన్ తెలిపారు. గ్రామాలలో కూడా సీసీ కెమెరాలు బిగించుకుంటే అన్ని విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఏదైనా సమస్య తెలిసిన వెంటనే మా దృష్టికి తెస్తే మేము వెంటనే పరిశీలిస్తామన్నారు.

## వడ్డే ఓబన్న జయంతిని విజయవంతం చేయండి

**రామసముద్రం జనవరి 10ప్రభాతవార్త**
వడ్డే ఓబన్న జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వడ్డెర సంఘం నాయకులు కోరారు. ఆదివారం ఉదయం నరసాపురం గ్రామంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నరసాపురం గ్రామస్తులు తెలిపారు. గ్రామం నుండి కారు, ద్విచక్ర వాహనాలు మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని మండలంలోని వడ్డెరలందరూ ఏకతాటిపై ఉండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వడ్డెరలు రాజకీయంగా రాణించే విధంగా ఏకతాటిపై ఉండాలన్నారు.

## యోగాలో సిల్వర్ మెడల్ సాధించిన యువతి



**ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 10, ప్రభాతవార్త**
మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయస్థాయి యోగాసనాల్లో కడప జిల్లా ప్రొద్దుటూరు 33వ వార్డుకు చెందిన యోగా మాస్టర్ చౌడమ్ సునంద జాతీయస్థాయి యోగాసనాల్లో పాల్గొని 19 రాష్ట్రాల యోగ క్రీడాకారులతో పోటీపడి రెండవ స్థానంలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అభినందనలు తెలిపారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మనిషిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని ఆ నైపుణ్యమే అటు సమాజానికి తన కుటుంబ ఉపాధికి ఉపయోగపడుతుందని తెలుపుతూ క్రీడాకారుల వల్లనే ప్రాంతాలకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్,34 వార్డు కౌన్సిలర్ పోస భాస్కర్, 33వ వార్డు ఉత్తమ కార్యకర్త జహీరుద్దీన్ పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

**బి కొత్తకోట జనవరి 10 ప్రభాతవార్త ః**
పెద్ద తిప్ప సముద్రం మండలం కందుకూరు ఎంపీపీ స్కూల్లో ఆదివారం యంగ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్, గుండె, బిపి, షుగర్, కీళ్లు, ఎముకలు, కిడ్నీ ఎంట్రాలజీ,ఈఎన్టీ, వ్యాధులకు పరీక్షలతోపాటు చికిత్సలు, ప్లాస్టిక్ సర్జరీ అవసరం ఉన్నవారికి ప్రముఖ వైద్య నిపుణులచే చికిత్సలు నిర్వహిస్తారని నిరుపేద రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యంగ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు విలేకరులకు తెలిపారు.

## అవినీతి ఆరోపణలపై విచారణ


విచారణ చేపడుతున్న అధికారి పెంచల కిషోర్

**బోయకొండ(చౌడేపల్లి), జనవరి 10 ప్రభాతవార్త**
శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో అవినీతి జరుగుతోందంటూ ఫిర్యాదు చేయడంతో శనివారం విచారణ చేపట్టారు. ఆయల ఇఓ ఏకాంబరం కొండపై పలు అవినీతి కార్యక్రమాలు చేశారని రాష్ట్ర పాల ఏకిరల ఛేర్మన్ నాగేశ్వరనాయుడు గతేడాది నవంబర్‌లో దేవాదాయధర్మాదాయశాఖ, ప్రభుత్వానికి ఫిర్యాదు చేసాడు. దీంతో కాణిపాకం ఇఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో శనివారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు దారుడైన నాగేశ్వరరావును తొలుత విచారించారు. అనంతరం ఇఓ ఏకాంబరంను విచారణ గావించారు. వీరితోపాటు బోయకొండ అభివృద్ధికి కోసం ఇళ్ళను కోల్పోయిన కొందరు లబ్దిదారులు జిల్లా కలెక్టర్ ఆదేశాలున్నప్పటికీ తమకు నష్టపరిహార నగదు చెల్లించలేదని ఆయనపై అభియోగాలు చేస్తూ విచారణాధికారికి వినతిపత్రాన్నందించారు. పెద్దభోగం విషయంలో అధిక ధరలకు విక్రయిస్తున్నా ఇఓ పట్టించుకోలేదనీ, అదే విధంగా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా సిబ్బంది నియామకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఇఓ ఏకాంబరంపై వున్నాయనీ, వాటిని క్షుణ్ణంగా విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పెంచల కిషోర్ తెలిపారు. అనంతరం అమ్మవారి దర్శనం, లడ్డూపోటు సందర్శన చేసారు.

## గంగమ్మ మహిమలు వ్యాప్తి చేయడమే ట్రస్టు లక్ష్యం

**బోయకొండ(చౌడేపల్లి), జనవరి 10 ప్రభాతవార్త**

అమ్మవారిని దర్శించుకొని ట్రస్టు సభ్యులు

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ మహిమలు నేల నాలుగు చెరగులా వ్యాపింప చేయడమే లక్ష్యంగా ట్రస్టు పనిచేస్తోందని సభ్యులన్నారు. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా బంగారుపేటకు చెందిన 12మంది సభ్యులు గంగమ్మ ట్రస్టును ఏర్పాటు చేశారు. గత 25సంవత్సరాలుగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోందని సభ్యులు తెలిపారు. అమ్మవారి కరణాకటాక్షాలు అందరిపై వుండాలని తమ ప్రాంతంలోని భక్తులకు ఉచిత ప్రయాణ, భోజన వసతి కల్పించి దాదాపు 200మంది యేటా వస్తుంటామన్నారు. లోకమాత గంగమ్మ అందరినీ చల్లగా చూడాలని వారందరూ ఆకాంక్షించారు.

## పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు

**కరెస్పాండెంట్ బి.ఎస్. రమణారెడ్డి**

**వేంపల్లి: జనవరి 10 (ప్రభాత వార్త)**
పండుగలు. సంప్రదాయానికి ప్రతీకలని, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బి.ఎస్. రమణారెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని, వేంపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డిప్యూటీ సివిల్ సర్జన్ శ్రీమతి వి. సుభాషిని ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తాను ఈ పాఠశాలలోనే చదువుకుని ఉన్నత స్థాయికి వెళ్లానని, మీరు కూడా బాగా చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఉద్బోధించారు. 200 మంది విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొని అందంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. ప్రతి తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ కూడా ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సతీమణి బిఎస్ విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయ బృందము,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




## పిచ్చి బఠాణీలు.. మెచ్చు గుణాలు

**తాజా బఠాణీలు..** ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదూ! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్ధేస్తుంది. బఠాణీలను క్యాలీఫ్లవర్, క్యాబేజ్, బంగాళదుంప, క్యారెట్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింపవుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటితో స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెందడంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచుగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ చేరిన సూక్ష్మ క్రిములను నశింపచేస్తాయి

## మదనపల్లిలో భూ వివాదం

### ఇంటి స్థలంపై దాడి.. రూ. 5 లక్షల ఆస్తి నష్టం

**మదనపల్లి, జనవరి 10 ప్రభాతవార్త.**
మదనపల్లి మండలంలోని కొత్తపల్లె పంచాయతీ భవానీనగర్ పరిధిలో గల ఒక ఇంటి స్థలం విషయంలో దౌర్జన్యం చోటుచేసుకుంది. తన స్థలంలో అక్రమంగా ప్రవేశించి, ఆస్తి నష్టం కలిగించడమే కాకుండా ప్రాణహాని తలపెడుతున్నారని బాధితుడు మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు కథలను మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వాయల్పాడు టౌన్‌కు చెందిన ఓ వ్యక్తి పేరు మీద 2011లో సర్వే నెంబర్ 307లో 2980.25 చదరపు అడుగుల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలానికి సంబంధించి పంచాయతీ అనుమతులు, విద్యుత్ కనెక్షన్ ఉండటమే కాకుండా, ప్రస్తుతం అందులో ఇండస్ కంపెనీ సెల్ టవర్ కూడా ఉంది. బాధితుడు తన స్థలం చుట్టూ సిమెంట్ బౌండరీ నిర్మించి, ఒక షెడ్డును కూడా ఏర్పాటు చేసుకున్నారు. అయితే మదనపల్లికి చెందిన ఓ మహిళకు ఈ స్థలంతో ఎటువంటి సంబంధం లేకపోయినా, తప్పుడు అగ్రిమెంట్లతో వివాదం సృష్టిస్తున్నారన్నారు. గత ఏడాది నవంబర్ 23 వ తేది మహిళ ఆమె కుమారులు, బంధువులు తదితరులు కలిసి తాము లేని సమయంలో స్థలంలోకి చొరబడ్డారన్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న సిమెంట్ బౌండరీని, రేకుల షెడ్డును, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారన్నారు. దీనివల్ల సుమారు రూ. 5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి రెండు రోజుల క్రితం నిందితులు స్థలంలోకి ప్రవేశించి, కోర్టు ఆదేశాలకు సంబంధించిన బోర్డును పెరికివేసి తీసుకెళ్లారన్నారు. అంతేకాకుండా నిందితులు తనను చంపుతామని తరచూ బెదిరిస్తున్నారని, వారి నుండి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని సికందర్ బాషా ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాఠశాల రజతోత్సవం




**వేంపల్లి: జనవరి 10 (ప్రభాత వార్త)**
శనివారం వేంపల్లి లో స్వామి వివేకానంద పాఠశాల25 వ వార్షికోత్సవం, స్వామి వివేకానంద 164 వ జన్మదినోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి అధ్యక్షత వహించగా, రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ న రెడ్డి తులసి రెడ్డి, టిడిపి నాయకులు,రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,శ్రీనివాస పాఠశాల కరస్పాండెంట్ కేశవులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశపు ముద్దుబిడ్డని, ఆయన జీవించింది కేవలం 39 సంవత్సరాలు అయినప్పటికీ భారతదేశపు యువతకు, ప్రపంచ యువతకు స్ఫూర్తి ప్రధాత అయ్యారని అన్నారు. యువతా! లే.. మేలుకో..గమ్యం చేరుకొరకు విశ్రమించకు అని ఆయన ఇచ్చిన సందేశం యువత మీద తారక మంత్రంగా పనిచేసింది అన్నారు. అన్ని సంపదలలో కెల్లా విద్యాసంపద ప్రధానమైనదని, నైతిక విలువలతో కూడిన విద్యను ఆధునికతతో మేలవించి వివేకానంద పాఠశాల విద్యార్థులకు విద్యను అందించడం అభినందనీయమని అన్నారు. చదువులో,ఆటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, నామా వినయ్, టిడిపి నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**వేంపల్లి: జనవరి 10:(ప్రభాత వార్త)**
స్థానిక నారాయణ పాఠశాల లో శనివారం ఆ పాఠశాల కరెస్పాండంట్ నారాయణ రెడ్డి ఆధ్యారం లో తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా అలంకరణతో, ఆచార వ్యవహారాలకు కట్టుబడి,తెలుగింటి వాతావరణంతో, తెలుగు వంటకాలు,భోగి మంటలు,హరిదాసు గీతాలతో,సాంప్రదాయ వేషధారణతో, అంగరంగ వైభవంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసినపట్టభద్రుల ఎం ఎల్ సీ భూమిరెడ్డి రాంగోపాలెరెడ్డిగారు మరియు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసి రెడ్డి తిలకించి పాఠశాలలో తెలుగుదనం ఉట్టిపడిందంటూ,మన సంస్కృతి సాంప్రదాయాలలో భాగంగా రంగవల్లులు, భోగిపళ్ళ,రైతుల వేషధారణ,బావి,గాలిపటాలు,ఎద్దులబండి , పంచెకట్టులతో విద్యార్థుల్లో కనపడ్డాయంటూ , సంక్రాంతి పండుగ విశిష్టత గురించి విద్యార్థుల కు ఉపన్యసించారు.పాఠశాల అధిపతులు శ్రీ కొట్టే నారాయణరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు సంక్రాంతి సంబరాల తో నాటి తరం లో మరుగునపడిన మన తెలుగు వారి కట్టుబాట్లు,మన వంటకాలు,మన తెలుగు వారి సంప్రదాయాలు ,తెలుగు పండుగలతో ప్రజలలోనీ అంతర్యాలు తొలగి ఐకమత్యం కలుగుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## గండి కోట ఉత్సవాలను విజయవంతంగా ఘనంగా నిర్వహిద్దాం

**జమ్మలమడుగు జనవరి10: ప్రభాతవార్త**
గండి కోట ఉత్సవాల ను విజయ వంతంగా ఘనంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.శనివారం రాత్రి జమ్మల మడుగు మండలం గండికోటలోని స్పోర్ట్స్ అకాడమీలో గండి కోట 2026 ఉత్సవాల నిర్వహణ పై సంబంధితఅధికారులతో సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గండి కోట ఉత్సవాలను విజయవంతం గా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేయడం జరిగిందనన్నారు. సందర్శకులు పూర్తి ఆహ్లాదకరమైన వాతావరణంలో పూర్తి వినోదం పొందేలా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. పార్కింగ్ ఏరియా,ప్రధాన వేదిక, స్టాల్స్ తదితర ప్రాంతాలలో బ్యారికేడింగ్ వ్యవస్థ పటిష్ట గా ఉండాలని ఆదేశించారు. జనవరి 11 వ తేదీ సా.4 గం.లకు శోభాయాత్ర ను పూర్తి పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాల మూడు రోజులు పాటు ఉత్సవాలను తిలకించేందుకు ఎక్కువ మంది సందర్శకులు వచ్చే అవకాశం కలదని,కావున పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు గా ఉండాలని డి పి ఓ ను ఆదేశించారు ..నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని తెలిపారు. ఫైర్ అధికారులు కూడా వారి వాహనాలతో అందుబాటు ఉండాలని, వైద్య ఆరోగ్య శాఖ వారి స్టాల్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా ప్రతి అంశాన్ని పరిశీలించాలన్నారు.ఉత్సవాలలో ప్రతి అంశానికి సంబంధించిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారుల సమిష్టి కృషి అధికారుల సమన్వయంతో ఈ ఉత్సవాలను విజయవంతం చేద్దామని తెలిపారు.



## క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థానాలు ఖాయం



ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 10 ప్రభాతవార్త

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదువుకుంటే అనుకున్న విజయాన్ని సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని వేదవ్యాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఉన్న వాసవి కళ్యాణ మండపంలో వేదవ్యాస డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కాలేజ్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, డిగ్రీ పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు ఐఏఎస్, ఐపీఎస్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వంటి పోటీ పరీక్షల్లో రాణించేలా విద్యార్థులు ఇప్పటి నుంచే కృషి చేయాలని సూచించారు. అధ్యాపకులు సుబ్బయ్య, కోదండపాణి మాట్లాడుతూ, కళాశాలలో నిర్వహిస్తున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో నాగరాజు, యాసిన్, రామలక్ష్మిరెడ్డి, గురుప్రసాద్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

యర్రగుంట్ల జనవరి 10, ప్రభాతవార్త :

మండల పరిధిలో సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి పండగ రోజులలో సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి పందేలు, పేకాట, గుండాట, చెక్క బొమ్మలాంటి ఆటలపై డబ్బు పెట్టి ఆడడం ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని, కోడి పందేల జూదరులను, కోడి కత్తుల తయారీదారులను, పేకాట శిబిరాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నామని. కావున ఎవరైనా మండల పరిధిలో కోడిపందాలు నిర్వహించిన వారికి ఆశ్రమం కల్పించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా కోడి పందాలు, జూదం ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సంబంధిత పోలీసుస్టేషన్‌లో లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ప్రజలు సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్తే పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని యర్రగుంట్ల సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. పండుగ సెలవుల్లో ఇండ్లను వదిలి ఎక్కువ రోజులు బయటికి వెళ్లేవారు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని ఇది మంచి అవకాశంగా తీసుకొని దొంగలు చోరీలకు పాల్పడే ప్రమాదం ఉందని సమాచారం ఇవ్వడం ద్వారా బీట్ సిబ్బంది ప్రత్యేక నిఘ ఉంచుతామన్నారు.

## ఏకగ్రీవంగా దళిత సంఘాల ఎన్నికలు

పుంగనూరు జనవరి 10 ప్రభాతవార్త



ఏపీ రాష్ట్ర దళితుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఏపీ రాష్ట్ర దళితుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం శంకరప్ప జిల్లాకు చెందిన పలు మండలాల అధ్యక్షులను ప్రకటించారు. మదనపల్లి జిల్లా రామసముద్రం మండలం నుండి కృష్ణప్ప, మదనపల్లి జిల్లా అధ్యక్షులుగా పుంగనూరు మండలం నుండి మరిమాకులపల్లి చెందిన మంజునాథ, మార్లపల్లి నుండి జి సుబ్రహ్మణ్యంను జిల్లా కార్యదర్శిగా తోపు మఠం నుండి.ముని రామయ్యను కార్యవర్గ సభ్యులుగా కాపాడ మెట్టపల్లి నుండి లక్ష్మీపతిను రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ గా ఎన్నుకోవడం జరిగినది. అంబేద్కర్ ఆశయాలను సాగించాలని,దళితుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు మన దళితులంతా కలసి కట్టుగా ఉండి సమస్యలను ఎదుర్కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగప్ప, పెంచుపల్లి కృష్ణప్ప, పెద్ద ఉప్పరపల్లి రాజా దళిత నాయకులు ఎస్సీ ఎస్టీ మానిటర్ కమిటీ సభ్యులు రాజా,ఎ.కుమార్,పత్రపల్లి లక్ష్మీపతిచౌడేపల్లివిజయ్ కుమార్, నాగరాజ మర్లపల్లికృష్ణప్ప సుబ్రహ్మణ్యం,గంగరాజుతోపు మట్టం నారాయణ కార్యక్రమంలో తదితర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరం

పుంగనూరు రూరల్ జనవరి 10 ప్రభాతవార్త



మైనర్లు వాహనాలు నడపరాదని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎంవిఐ సుప్రియ హెచ్చరించారు. శనివారం పుంగనూరు లోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాలలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఎంవిఐ సుప్రియ మాట్లాడుతూ, మైనర్లు వాహనాలు నడిపితే చట్టప్రకారం వారి తల్లిదండ్రులు కూడా శిక్షార్హులవుతారని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

పుంగనూరు రూరల్ జనవరి 10 ప్రభాతవార్త



స్వచ్ఛంద రక్తదానం ప్రాణదానంతో సమానమని హోమియో డాక్టర్ శివ అన్నారు. స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాల్లో భాగంగా శనివారం పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణంలో స్వామి వివేకానంద యువసేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురి ప్రాణాలను కాపాడినట్లేనని తెలిపారు. ఈ శిబిరం ద్వారా సుమారు 40 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఎస్వీఎస్ మదనపల్లి బ్లడ్ డొనేషన్ ట్రస్ట్‌కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివేకానంద యువసేన సభ్యులు, కుమార్ మంజు విజయభాస్కర్ రెడ్డి నాయక్ అమరావతి సురేష్ గణేష్ ఎస్వీఎస్ చారిటబుల్ బ్లడ్ డొనేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచితంగా పరుపులు వితరణ

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 10 ప్రభాతవార్త



శివపురం తరుణ్ కుమార్ సౌజన్యంతో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి వైస్ ప్రెసిడెంట్ గండ్లూరు శ్రీధర శర్మ కసెట్టి హై స్కూల్ ఉపాధ్యాయులు ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ ఉద్యోగుల వర్గం సభ్యులు మురళీకృష్ణ కమలాపురం డిగ్రీ జూనియర్ కళాశాలల కరస్పాండెంట్‌ల ఆధ్వర్యంలో కమలాపురం పట్టణం అప్పాయపల్లె లోని శ్రీ దయానంద స్వామి ఆశ్రమంలోని నిరుపేద విద్యార్థులకు 60 పరుపులు 60 దిండ్లు 60 బెడ్ సీట్లు వితరణ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చక్కటి క్రమశిక్షణతో సాంప్రదాయ పద్ధతిలో వేద కాలం నాటి ఋషి ఆశ్రమాలను తలపించే విధంగా ఆశ్రమం ఉందని, విద్యార్థులందరూ చక్కగా విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదగాలని ఆశిస్తూ అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ శ్రీధరశర్మ, సివి రాజగోపాల్‌రెడ్డి, అల్లె రాజారెడ్డి, రాఘవ, దొంతు మురళీకృష్ణ, శ్రీవాణి భార్గవ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ మరమ్మత్తు పనులు.

తంబళ్లపల్లె జనవరి 10 ప్రభాతవార్త ః

మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్లు పరిధిలో ముమ్మరంగా మరమ్మత్తు పనులు చేపట్టారు. శనివారం ఉదయం 9 గంటలనుండి 12 గంటల వరకు తంబళ్లపల్లె, కన్నె మడుగు, కుక్కరాజుపల్లి, కోసువారిపల్లి, గోపిదిన్నె సబ్స్టేషన్లలో లెవెన్ కె.వి ఎల్.ఏ.ఎస్ బిగింపు, మెయింటెనెన్స్ పనులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమాలలో లైన్ ఇన్స్పెక్టర్ భాస్కర్, లైన్మెన్ శంకర, నాగేంద్ర, అనిల్, ఇంతియాజ్, నాగేంద్రబాబు, శేషు, కాలేశా, రమేష్, సురేష్, ప్రవీణ్, రాజశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీయూ రథసారథులుగా శివారెడ్డి, మధుసూదన.

మదనపల్లెక్రైమ్, జనవరి 10 ప్రభాతవార్త.



ఎస్‌టియు అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా అంకం శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోకల మధుసూదన, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా మోహన్‌కుమార్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మదనపల్లెలో జరిగిన సమావేశానికి ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ఎన్నికల పరిశీలకులు బాలగంగారెడ్డి, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిల సమక్షంలో మదనపల్లె జిల్లా కేంద్రంగా ఏర్పడిన నూతన అన్నమయ్య జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉపాధ్యాయ విద్యారంగా పరిరక్షణకు కృషిచేసి సంఘ అభివృద్ధికి నిత్యం కృషి చేయాలని తెలియజేశారు. మాజీ శాసన మండలి సభ్యులు కత్తి నర్సింహారెడ్డి మాట్లాడుతూ 12వ వేతన సవరణ అమలు ఆలస్యం అవుతున్న కారణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని సిపిఎస్, జిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధించాలని బకాయిలను విడుదల చేయాలని ఉమ్మడి సర్వీసులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు కడియాల మురళి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌టియు నాయకులు జనార్దన్ రెడ్డి, నరసింహులు, అయూబ్ ఖాన్, భాస్కర్ రెడ్డి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తలనీలాల వేలం పాట వాయిదా

సిద్దవటం జనవరి 10 ప్రభాతవార్త

నిత్యపూజ స్వామి తలనీలాల వేలం పాట రెండవ సారి వాయిదా పడింది. మండలకేంద్రమైన సిద్దవటం రంగనాథ స్వామి ఆలయంలో శనివారం వేలం పాటను రూ. 5 లక్షలతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ జనార్ధన్, ఆలయ ఛైర్మెన్ రాజేంద్రప్రసాద్, ఈఓ శ్రీధర్‌లు ప్రారంభించారు. పవన్ కళ్యాణ్ 5.25 లక్షలు, రామూర్తి 5.35 లక్షలు, బ్రహ్మేంద్ర 5.40 లక్షల వరకు పాడారు. గత ఏడాది మహాశివరాత్రి పార్వదినాల్లో తలనీలాలు రూ. 5.51 లక్షలు పలికింది. గత ఏడాది కంటే ఈ ఏడాది తక్కువ ధర పలకడం సరైన పాట రాకపోవడంతో అధికారులు వేలంపాటను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది చంద్ర, పాటదారులు పాల్గొన్నారు.

## 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

బద్వేలు ,జనవరి 10, ప్రభాతవార్త



ప్రభుత్వం సంక్రాంతి కానుకగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వేతన సవరణ సంఘం గడువు ముగిసి ఇప్పటికే రెండేళ్లు ఆరు నెలల కాలం పూర్తయ్యిందని, ఇప్పటివరకు నూతన వేతన సవరణ అమలు కాకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీతో పాటు ఇటీవల ఉద్యోగ సంఘాలకు ముఖ్యమంత్రి వేతన సవరణ, మధ్యంతర భృతిపై స్పష్టమైన హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉద్యోగులు ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్షను రద్దు చేయాలని, బదిలీల చట్టం ప్రకారం పదోన్నతులు మరియు బదిలీలకు షెడ్యూల్‌ను విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ వైయస్సార్ కడప జిల్లా అధ్యక్షులు ఎబి. రామకృష్ణమరాజు, రాష్ట్ర కౌన్సిలర్ మానుగుంట రవిశంకర్, అన్నమయ్య జిల్లా గౌరవ అధ్యక్షులు బచ్చల శ్రీనివాసులు, అలాగే నాయకులు రామకృష్ణ, సింగం ఓబులేసు, ఆనంద్, ప్రభాకర్, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, కృష్ణయ్య, రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాలు,పేకాట నిర్వహిస్తే చర్యలు

ముద్దనూరు,జనవరి 10, ప్రభాతవార్త:

సంక్రాంతి వేడుకలలో కోడిపందాలు పేకాట వంటి ఆ సాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని సిఐ నగేష్ బాబు శనివారం అన్నారు. మండల పరిధిలోని సంక్రాంతి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎవరైనా గొడవలు సృష్టిస్తే చర్యలు తీసుకొనబడతాయని తెలిపారు. పండగ సందర్భంగా సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు చేపట్టి, చుట్టుపక్కల వారిని తమ ఇంటి వైపు గమనిస్తూ ఉండాలని, ఇంటిలో విలువైన నగదు బంగారు నగలు వంటి వస్తువులు ఉంచకుండా తమ వెంట గాని బ్యాంకు లాకర్లలో గాని ఉంచుకొని వెళ్లాలని, స్థానిక పోలీస్ స్టేషన్లో తమ సమాచారం అందించి వెళ్లాలని కోరారు. అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100/112 డయల్ కుగాని సంబంధిత పోలీస్ అధికారులకు సమాచామివ్వాలన్నారు.

## డీసీసీ అధ్యక్షుడిగా గాజుల భాస్కర్

సుండుపల్లి, జనవరి 10,ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తాజాగా ప్రకటించిన జిల్లా కమిటీ అధ్యక్షుల జాబితాలో అన్నమయ్య జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా సుండుపల్లి మండలం ముడుంపాడు గ్రామంకు చెందిన గాజుల భాస్కర్ రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం అన్నమయ్య జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాయచోటిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాజుల భాస్కర్‌కు శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో గాజుల భాస్కర్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సల్మాన్, ఎస్సీ సంఘ నాయకుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గాలిపటం ఎగరేస్తూ బాలుడు మృతి

గాలివీడు, జనవరి 10(ప్రభాతవార్త):



మండల కేంద్రం గాలివీడులో శనివారం గుండెల్ని కలిచివేసే విషాద ఘటన చోటు చేసుకుంది. గాలిపటాలు ఎగరేస్తూ ఆడుకుంటున్న కొమ్మెద్ది ఆనంద్ శ్రీనివాస్(2) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు గోరాన్‌చెరువు గ్రామం బుచ్చెవాండ్లపల్లెకు చెందిన కొమ్మెద్ది ప్రసాద్, గాయత్రి దంపతులు గాలివీడు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న మూడంతస్లు భవనంలో నివాసం ఉంటున్నారు. కుటుంబ పోషణ కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన ప్రసాద్ ఇటీవలే రెండు మాసాల క్రితం స్వదేశానికి తిరిగివచ్చాడు. అయితే సంక్రాంతి పండుగ గాలిపటం రూపంలో ఆ తండ్రికి పుత్రశోకాన్ని మిగిల్చింది. సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం తోటిపిల్లలు గాలిపటాలు ఎగరేస్తుండగా ఓ గాలిపటం విద్యుత్ తీగలకు చిక్కుకుని ఊగిసలాడుతూ ఉంది. ఈ ప్రమాదాన్ని గమనించని బాలుడు చివరి అంతస్తు వరండాలో నిలబడి ఇంటిని శుభ్రపరిచే ఇనుప పైపుతో గాలిపటాన్ని తీసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలను తాకిన స్టీల్ పైపుకు విద్యుత్ ప్రసరించడంతో బాలుడు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే సమయంలో గాలిపటం తీసే ప్రయత్నం చేసిన మరో బాలిక కూడా స్వల్పంగా విద్యుత్‌షాక్‌కు గురై గాయాలపాలైంది. అయితే ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఈ ఘటనతో బాలుడి తల్లిదండ్రులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. పండగ పూట గాలిపటాల సరదా ఆట ఆ ఇంట తీవ్ర విషాదాన్ని నింపిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మదనపల్లె జిల్లా కేంద్రంతో పెరిగిన ఇళ్ళ అద్దెలు

### అద్దె ఇళ్లకోసం పట్టణంలో అధికారులు వేట.. ఖాళీ స్థలాలకు సైతం పెరిగిన అధిక ధరలు

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :




అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె ఏర్పాటు కావడంతో ఒక్కసారిగా మదనపల్లె పట్టణంలో ఇండ్ల అద్దెలు పెరిగాయి. త్రిబుల్ బెడ్‌రూమ్‌ల ఉన్న ఇండ్ల కోసం పట్టణంలో అధికారులు సహాయకుల ద్వారా గాలిస్తున్నారు. జిల్లాలో సెలక్షన్‌గ్రేడ్ మున్సిపాలిటిగా ఉన్న మదనపల్లెలో ఇప్పటికు రెండు లక్షలకు పైగా జనాబా ఉన్నారు. జిల్లా కేంద్రం కావడం వల్ల పట్టణంలో జనాభా మరింత పెరగనున్నది. దీనికితోడు జిల్లా అధికార యంత్రాంగం అంతా మదనపల్లెలో నివాసాలు ఉండడంతో పట్టణం మరింత రద్దీగా ఏర్పడనున్నది. సుమారు 60నుంచి 70శాఖలకు సంబంధించి అధికారులు మదనపల్లెలో నివసించనున్నారు. ఇప్పటికే జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు సిద్ధం చేశారు. అయితే వీరు నివాసాలు ఉండేందుకు పట్టణంలో అద్దె ఇండ్ల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. పట్టణంలో ప్రధానంగా ప్రశాంతంగా ఉండే సొసైటికాలనీ, పిఅండ్‌టి కాలనీ, రెడ్డీస్‌కాలనీ, కురవంక, ఎస్‌బిఐ కాలనీ, ప్రశాంతనగర్, ఎన్‌విఆర్‌లేవుట్, రోజాప్లాట్స్, రెడ్డప్పనాయుడు కాలనీ ప్రాంతాల్లో అద్దె ఇండ్ల కోసం అధికారులు గత వారం రోజులుగా గాలిస్తున్నారు. సంక్రాంతి తరువాత మదనపల్లెలో నివాసాలు ఉండేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. మదనపల్లెలోనే జిల్లా పరిపాలనను జిల్లా అధికారులు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, పంచాయితీరాజ్, ఆర్‌అండ్‌బి, హౌసింగ్, సాంఘీక సంక్షేమ శాఖ, పశువర్థకశాఖ, అటవీశాఖ, వ్యవసాయశాఖకు సంబంధించిన అధికారులు ఎక్కువుగా అద్దెఇళ్ళ కోసం గాలిస్తున్నారు. మదనపల్లె జిల్లా కేంద్రం కావడం పట్ల ఖాళీ స్థలాలకు సైతం ధరలు పెరిగాయి. ఇక మున్సిపాలిటితో పాటు రూరల్ ప్రాంతాల్లో ఉన్న భూములకు కూడా ధరలు పెరిగాయంటూ రియల్టర్లు చెబుతున్నారు.

## నూతన కమిటీ అధ్యక్షులకు అభినందనలు

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :



మదనపల్లె నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో నూతనంగా నియామకం కాబడిన కమిటీ అధ్యక్షులకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చిన బాబు శనివారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. రూరల్ మండల టిడిపి అధ్యక్షులుగా దేవరింటి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులుగా నాదేండ్ల అరుణ్(చింటూ), రామసముద్రం మండల అధ్యక్షులుగా విజయగౌడ్, నిమ్మనపల్లె మండల అధ్యక్షనిగా రాజన్న, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు ముద్దుక్రిష్ణమనాయుడు, బోనాల రమేష్‌లకు అభినందనలు తెలిపారు. తెలుగుదేశంపార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఒరాకిల్‌పై సదస్సు

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :


అభినందిస్తున్న దృశ్యం

పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఒరాకిల్ ప్యూజన్‌పై సాంకేతిక సదస్సు నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) విభాగం ఆధ్వర్యంలో ఒరాకిల్ ప్యూజన్ యాప్ యొక్క రియల్‌టైమ్ అమలు అను అంశంపై సాంకేతిక ఉపన్యాసం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా యాక్సెంచర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆనంద్ హాజరై మాట్లాడారు. ఒరాకిల్ క్లౌడ్, సాస్ ఆధారిత అనువర్థనాలు, వాటిపరిశ్రమల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రియల్‌టైమ్ ప్రాజెక్టుల ద్వారా ఒరాకిల్ ప్యూజన్ యాప్‌ల అమలులో ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల మేనేజ్‌మెంటు సభ్యులు ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ఎం.నాగమల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి,ప్రిన్సిపాల్ రాముడు, విభాగాదిపతులు పాల్గొన్నారు.

## శ్రీ వినాయక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నందలూరు, జనవరి 10 ప్రభాతవార్త :



మండలంలోని టంగుటూరు గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రీ వినాయక క్రికెట్ టోర్నమెంట్‌ను సింగిల్ విండో అధ్యక్షులు పసుపులేటి ప్రవీణ్ కుమార్, టీడీపీ మండల కో-క్లస్టర్ ఇంచార్జ్ చుక్క యానాది, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బండారు రెడ్డి శేఖర్ శనివారం ప్రారంభించారు.ఈ టోర్నమెంట్‌కు ప్రథమ బహుమతిని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, రెండో బహుమతిని చుక్క యానాది అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమని, గెలుపు- ఓటములను సమానంగా స్వీకరించాలని యువతకు సూచించారు. సంక్రాంతి పండుగను క్రీడలతో ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మరో 33 కెవి సబ్ స్టేషన్ మంజూరు

కురబలకోట జనవరి 10 ప్రభాతవార్త

కురబలకోట మండలానికి మరో 11/ 33 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేసిందని కురబలకోట మండల ట్రాన్స్కో ఏఈ శంకర్ రెడ్డి తెలిపారు. సుమారు 5 కోట్లు రూపాయల వ్యయంతో దీన్ని చేనేత నగర్, విశ్వం ఇంజనీరింగ్ కళాశాల కు సమీపన ఏర్పాటు చేసేందుకు మదనపల్ల ట్రాన్స్కో కు ఉన్నతాధికారులు స్థల పరిశీలన నిర్వహించారన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇదేవిధంగా 130 కె.వి ఇది సబ్ స్టేషన్ కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పరిశీలనలో ఉందన్నారు. దీనికోసం మండలంలోనిచెన్నా మరి మిట్ట, బైసాని వారి పల్లి వద్ద ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు పరిశీలించారు. వ్యవసాయానికి ఉదయం పూటే త్రీ ఫేసులో 9 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా రక్షిత మంచినీటి పథకాల, వ్యవసాయ బోర్లకు చెందిన చెందిన విద్యుత్ కలెక్షన్లు విభజించి ప్రత్యేక ఫీడర్లు ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. ఇదివరకే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ దశలవారీగా వారిగా ట్రాన్స్ఫార్మర్లు అందజేస్తున్నా మని తెలిపారు. వినియోగదారులకు, రైతులకు అవాంతరాలు లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు.

## వైభవంగా దర్గాలో ఉరుసు కవ్వాలి

రామసముద్రం జనవరి 10 ప్రభాతవార్త



మండలంలోని చెంబకూరు మూడు రోడ్లు కూడలిలో ఉన్న హ్జాత్ సుల్తాన్ అలీషా హుస్సేని ఖాధరీ సర్వరీ వారి ఖలిఫే షాసాని హజ్రత్ సుల్తాన్ చమన్ దార్ అలీషా హుస్సేని ఖాధరీ దర్గా లో శనివారం 38 ఉరుసు కావ్వాలి కనులు పండువగా దర్గా కమిటీ సభ్యులు నిర్వహించారు. దర్గాను మదనపల్లి, బెంగళూరు నుండి పలురకాల పుష్పాలు తెచ్చి సుందరంగా అలంకరణ చేసి విద్యుత్ కాంతుల నడుమ భక్తి శ్రద్ధలతో ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉరుసు, కవ్వాలి ఘనంగా నిర్వహించారు. దర్గాలో వీరి కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భూంది, చెక్కర పెట్టి సదివింపులు చేసి భక్తులకు పంచి పెట్టారు. ఈ ఉరుసు కవ్వాలి తిలకించడానికి హిందూ ముస్లిం సోదరులు వీక్షి ంచారు. ప్రత్యేకంగా కర్ణాటక రాష్ట్రం నుండి అంజాద్ చిష్టి బృందం చే కవ్వాలి జరిగింది. రాత్రి దర్గా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం

కె.వి పల్లి , పీలేరు జనవరి 10, ప్రభాతవార్త



కారు ద్విచక్ర వాహనంను ఢీకొన్న ప్రమాదంలో విద్యార్థినికి కుడికాలు తొడ వరకు విరిగి పక్కన పడిగి దుర్మరణం చెందిన హృదయ విదారక ఘటన కె.వి పల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు సంబేపల్లి మండలం, రెడ్డివారి పల్లి పంచాయతీ నడిమి రాజు వారి పల్లి హరిజనవాడకు చెందిన ఇసుకపల్లి కృష్ణయ్య కుమార్తె శివరాణి (17) తిరుపతిలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది సంక్రాంతి సెలవులు రావడంతో ఇంటికి రావడం కోసం తిరుపతిలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న తన అన్న మల్లేశ్వర, శివరాణి ఇద్దరు ద్విచక్ర వాహనంలో తమ స్వగ్రామమైన దేవపట్ల సమీపంలోని రెడ్డివారి పల్లి గ్రామం నడిమి రాజు వారి పల్లికి వస్తూ ఉండగా శనివారం కారులో వస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేవీ పల్లి సబ్ ఇన్స్పెక్టర్ వెంకట శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పుడమి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు.

తంబళ్లపల్లె జనవరి 10 ప్రభాతవార్త ః



మండలం ఎద్దుల వారి పల్లి పంచాయతీ దండు వారిపల్లెలో శనివారం తంబళ్లపల్లె పుడమి ఏజెన్సీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళలు ఉత్సాహంగా ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ముగ్గుల పోటీల విజేతలకు పుడమి ఏజెన్సీ ఏ.ఎమ్, ఆర్.ఓ రాజు , మేనేజర్ మాధవ్ కుమార్, బిజెపి మండల అధ్యక్షుడు వెంకటరమణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తో పాడి పంటలతో రైతులు తులతూగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎద్దులవారిపల్లి పంచాయతీ కి చెందిన మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న జాతి మణిరత్నం

తంబళ్లపల్లె జనవరి 10 ప్రభాతవార్త ః



స్వాతంత్ర సమరయోధుడు రేనాటి ముద్దుబిడ్డ తెల్ల దొరల పాలన పై అలుపెరగని పోరాటం చేసి బ్రిటిష్ వారిని తరిమి కొట్టిన విప్లవ వీరుడు వడ్డే ఓబన్న వడ్డెర జాతికే మణిరత్నంగా నిలిచాడని తంబళ్లపల్లె మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు రేపన మల్లికార్జున కొనియాడారు. శనివారం వడ్డెర సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అలనాటి స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగ గా ప్రకటించడం హర్షనీయమన్నారు. 11వ తేదీ ఆదివారం ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ప్రతి ఒక్క వడ్డెర కులస్తుడు కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు పూజారి వెంకటరమణ, మహిళా నాయకురాలు రామలక్ష్మి, తేపల్లె రెడ్డప్ప, తేపల్లె నరసింహులు, నాగరాజు, నడిపన్న, శివశంకర, రమణ, మల్లప్ప, అరుణ, సిద్ధమల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు

ప్రొద్దుటూరు జనవరి 10 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మండలం పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో గ్రామీణ ప్రాంతాలలో ఎంతో సాంప్రదాయ బద్ధంగా జరుపుకునే గొప్ప పర్వదినం సంక్రాంతి అన్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ఆవరణలో ముందుగా విద్యార్థులకు మెహిందీ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు అనంతరం తోరణాలు కట్టడం ముగ్గుల పోటీలు విద్యార్థులతో పాటు ఆధ్యాపకులు కూడా వంట పోటీలు నిర్వహించినట్లు తెలిపారు అలాగే తెలుగు సంస్కృతికి అద్దం పట్టేలా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు ఈ సంక్రాంతి సంబరాలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ డైరెక్టర్లు నాగూరు రవీంద్రారెడ్డి కోడైరెక్టర్ శైలూష డిప్లమా ప్రిన్సిపల్ ప్రకాష్ రావు వివిధ విభాగ అధిపతులు ఆలీ జాబీర్ సుకుమార్ విజయమ్మ అధ్యాపకులు మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## గండికోట ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

ప్రొద్దుటూరు జనవరి 10 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్న గండికోట ఉత్సవాలకు ప్రొద్దుటూరు డిపో నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు జనవరి 11, 12, 13 తేదీలలో ఈ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు ఆదివారం ఉదయం 11 గంటల నుండి ఆర్డినరీ మరియు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉంటాయన్నారు ఆర్డినరీ బస్సు కు 50 రూపాయలు ఎక్స్‌ప్రెస్ బస్సు కు 65 రూపాయలు చార్జిగా నిర్ణయించినట్లు తెలిపారు కావున ప్రొద్దుటూరు మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

## కోడి పందాలు ఆడితే కఠిన చర్యలు

పెద్దమండెం జనవరి 10 ప్రభాతవార్త



మండలంలో ఎక్కడైనా ఎవరైనా కోడిపందాలు జూదం ఆడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రావణి అన్నారు. శనివారం మండలంలోని ఆటో వాహనదారులకు ప్రజలకు గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్ల తీసుకుంటామని ప్రజలకు నిర్వాహకులకు హెచ్చరించారు జూదం సారా పై ప్రత్యేక నేహా పెట్టినట్లు ఆమె తెలిపారు అలాగే ఆటో వాహనదారులు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలపకూడదని రాకపోకలకు అంతరాయం కలవకుండా వాహనాలను నిలువ చేసుకోవాలన్నారు ఎక్కడైనా ఎక్కడైనా అనుమానాస్పదంగా కనపడిన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన తమ దృష్టికి తీసుకురావాలని ఆటో నిర్వాహకులకు విషయాన్ని ఉద్దేశం చేశారు ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

సిద్దవటం, జనవరి 10 ప్రభాతవార్త



స్థానిక శ్రీ సాయి హై స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పిల్లలకు సంక్రాంతి పండుగ విశిష్టత ను తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిదాసు వేషాలు, ఆడపిల్లలు పట్టు బట్టలను ధరించి రంగవల్లికలను వేయడం జరిగినది. గంగిరెద్దులు, కోడిపందాల ఆటలలో ఉత్సహంగా పాల్గొన్నారు. పిల్లలకు భోగి పండ్లను తలపై పోసి అందరికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గాలి పటాలను కేరింతలు కొడుతూ ఎగురవేశారు. ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయడం జరిగినది. పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆపిల్ అలంకరణలో శ్రీ అభయ లక్ష్మీనరసింహస్వామి

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారిన గర్ వద్ద ఉన్న శ్రీ అభయ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసం సందర్భంగా స్వామివారిని కాశ్మీర్‌పాల ఆపిల్ అలంకరణ చేశారు. ఆలయ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు రమేష్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ధనుర్మాస పూజలు వైభవంగా జరిగాయి. స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్స ర పుష్య శుద్ధసప్తమి సందర్భంగా ఆలయం లో స్వామివారికి, అమ్మవారికి విశేష పంచా మృతాభిషేకం జరిగింది. ఆలయ ఛైర్మెన్ ద య్యాల మల్‌రెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధనుర్మాసం సందర్భంగా స్వా మివారికి తెల్లవారుజామున అభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి.

## సప్పలమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె, జనవరి 10 ప్రభాతవార్త :



రూరల్ మండలంలోని సిటిఎం క్రాస్‌రోడ్డులో వెలసి ఉన్న శ్రీ సప్పలమ్మ దేవస్థానంలో శనివారం అభిషేకం, హోమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం నిర్మిం చి రెండేళ్ళు పూర్తిచేసుకోవడంత తృతీయ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషే కం, గణపతి, నవగ్రహ, శ్రీదుర్గహోమం నిర్వహిం చారు. వాల్మీకిపురం ప్రవీణ్‌స్వామి, నటరాజ స్వాముల వేదమంత్రాల మధ్య పూజా కార్యక్రమం జరిగింది. అ దిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, ఆలయ కమిటీ సభ్యు లు శోభ, సరళ, దీప, మంజుల, భవాని, రెడ్డిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీలలో సత్తా చాటిన యువత



గోపవరం, జనవరి 10, ప్రభాతవార్త

స్వామి వివేకానంద జయంతి నేషనల్ యూత్ డే పురస్కరించుకుని కడప లో యువతకు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు ఈ పోటీలలో దాదాపు 20 టీములు పాల్గొన్నాయి. ఈపోటీలలో బద్వేల్ ఆట గాళ్లు తమ ధైర్యాన్ని, సమర్థతను ప్రదర్శించారు. భారత ప్రభుత్వం యువ జన క్రీడా వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ మైభారత్ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో15 నుంచి 29 సంవత్సరాలలోపు ఉన్న యువ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్న బద్వేల్ జట్టు ఆటగాళ్ల సమన్వయం, ఉత్సాహం మరియు పటిష్ట అనుభవం ఇతర జట్లతో పోటీగా నిలబడింది. ఈ హోరాహోరి పోటీలలో కడప జట్టు ప్రథమ స్థానంలో నిలవగా ద్వితీయ స్థానం లో బద్వేలు జట్టు నిలిచింది. వీరికి అధికారులు పథకాలు, మెడల్స్ అందించా రు. ఈ మేరకు బద్వేలు టీములో ఆడిన కే సుభాన్ కే వంశీ సి అఖిల్ పి మల్లయ్య ఎం లోకేష్ పి శేఖర్ లను బద్వేలు ప్రజలు అభినందించారు.

## సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలి



కురబలకోట జనవరి 10 ప్రభాతవార్త

సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మీట్స్ పూర్వ విద్యార్థి కుప్పం జోహారి అన్నారు. కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి సమీపాన ఉన్న మీట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ లో మదనపల్లి కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అధునాతన సైబర్ సెక్యూరిటీ మరియు సె క్యూరిటీ మరియు ఎథికల్ హ్యాకింగ్ సిల్క్స్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని వారం రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా మీట్స్ పూర్వ విద్యార్థి సైబర్ సెక్యూరిటీ కన్సల్టెంట్ కుప్పం జోహారి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉ న్న డిజిటల్ పరివర్తన అధిపత్యంలో సైబర్ భద్రత యొక్క ప్రాముఖ్యత ఎంతై నా అవసరమని ప్రతి విద్యార్థి వ్యక్తిగత డేటా ఉల్లంఘాల నుండి పెద్ద ఎత్తున కార్పోరేట్ దాడుల వరకు సైబర్ బెదిరింపులో వ్యక్తులు వ్యాపారులు మరియు ప్రభుత్వాలకు ఒకేలాగా మారాయని అన్నారు. సైబర్ బెదిరింపులు సిస్టంలో నెట్వర్క్ మరియు అప్లికేషన్స్ లోనే బలహీనతలు ఉపయోగించి కొని అనేక రకాల హానికరమైన కార్యకలాపాలను కలిగి ఉంటాయని ఈ బెదిరింపులు తర చుగా సున్నితమైన సమాచారాన్ని దొంగలించడం కార్యకలాపాలకు అంతరా యం కలిగించడం ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పో టీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు నగదు బహుమతు లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్ విభాగా ధిపతి డాక్టర్ .కే .దినేష్ ,కోఆర్డినేటర్స్ ఎన్ .జున్ను బాబు ,ఎన్ సాయి కిరణ్ ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గల్ఫ్ దేశం కువైట్‌లో
## పెద్దఎత్తున టీడీపీ పార్టీలోకి చేరికలు

సుండుపల్లి, జనవరి 10,ప్రభాతవార్త :

కువైట్ సిటీ (ఫామియా)ప్రాంతంలో టీడీపీ యువ నాయకులు పఠాన్ ఖాన్ భాయ్ ఆధ్వర్యంలో, టీడీపీ ఎన్నారై నాయకుల కార్యకర్తల సౌజన్యంతో పార్టీ లోకి చేరికలను ఆహ్వానించారు. టీడీపీ యువ నాయకులు ఖాన్ భాయ్ , కొల్లి ఆంజనేయులు నాయుడు,టీడీపీ పాలాయెకిరి కువైట్ అధ్యక్షుడు కొండా మల్లి శ్రీహరి నాయుడు,జిలాన్ భాషా,పెద్దనాగూర్ సమక్షంలో అన్నమయ్య మరియు ఉమ్మడి కడప జిల్లా నుండి మహబూబ్ బాషా,రెడ్డిబాషా,ఇలియాస్ భాషా ,రమేష్ తదితరులు దాదాపుగా 15మంది కార్యకర్తలు వైసీపీ పార్టీని వీడి టీడీపీ పార్టీలోకి కండువాలు వేసి ఆహ్వానించారు తదనంతరం రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు కొత్తగ టీడీపీ పార్టీ లో చేరిన కార్యకర్తలను ఉద్దేశించి చరవాణిలో మాట్లాడుతూ మీకు ఎలాంటి సమస్యలు వచ్చినా పార్టీతో పాటు నేను కూడా మీకు మద్దతుగా ఉంటానని భరోసా ఇచ్చారు విదేశాల్లో ఉ న్నప్పటికీ తెలుగు దేశం పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న టీడీపీ ఎ న్నారై నాయకుల కార్యకర్తల సేవలు అభినందనీయమని ఆయన అన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఐక్యతతో ముందుకు సాగాలని పిలు పునిచ్చారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వ హిస్తూ, గల్ఫ్ దేశాల్లోనూ టీడీపీని బలమైన శక్తిగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సుగవాసి యువసేన అధ్యక్షులు కంచన రెడ్డి శేఖర్ (ఎన్ ఆర్ ఐ టీడీపీ)వంటి నాయకుల కృషితో కువైట్‌లో పార్టీకి మంచి ఆదరణ లభిస్తోందని ప్రశంసించారు. తదనంతరం టీడీపీ యువ నాయకులు ఖాన్ భాయ్ ఈ కార్య క్రమానికి వచ్చిన కొంతమంది మహిళలకు చీరలు పంపిణీ తో పాటుగా వారికి ప్రత్యేకంగా విందు భోజనం ఏర్పాటు చేశారు.



## సంక్రాంతి సంబరాలు

కడప, జనవరి 10, ప్రభాతవార్త

కెఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కాలేజ్ ముందస్తు సంక్రాంతి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఈ సందర్భంగా కాలేజ్ కల్చరల్ క్లబ్ వారి ఆధ్వర్యంలో లో రంగవల్లి పోటీలను నిర్వహించారు. కందుల విద్యా సంస్థల కరస్పాండెం ట్ రాజేశ్వరమ్మ పండుగ సంప్రదాయం ప్రకారం భోగి మంట వెలిగించి, వి ద్యార్థినిలు పొంగలిని వండి దేవునికి నివేదించి అందరికీ పంచిపెట్టారు భోగి మంటలు చుట్టూ కోలాటం వేసి అలరించారు, అటు తర్వాత రాజేశ్వరీ మా ట్లాడుతూ పండగలు సంప్రదాయానికి ప్రతీకలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృ తి సాంప్రదాయాలు కాపాడుకోవడం మనందరి బాధ్యతగా అని తెలిపారు. త ర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా కరస్పాండెంట్ కందుల రాజేశ్వరీ, రంగ వల్లి పోటీలో గెలి చిన వారికి భహుమతులు ప్రదానం చేశారు. మొదటి భహుమతి ఐశ్వర్య టీ మ్ గెలుపొందారు, రెండవ బహుమతి బిందు టీమ్ పొందారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీఎన్ ప్రసాద్, కాలేజ్ కల్చరల్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ వీర శం కర్, కాలేజ్ స్టూడెంట్ అఫ్ఫైర్స్ డీన్ బీ మనోరమ దేవి, ఫెస్టివ్స్ కమిటీ కోఆ ర్డినేటర్ డీ మమత మరియు కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లా జడ్జిలుగా ఏడేళ్ళ ప్రాక్టీస్ న్యాయవాదులు అర్హులే

(జిల్లా జడ్జీ నియామకానికి హైకోర్టు సిఫారసు తప్పనిసరి-బార్ కోటా క్రింద జిల్లా జడ్జీ పోస్టులకు అర్హులు)

(సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక తీర్పు)

బద్వేలు లీగల్, జనవరి 10 ప్రభాతవార్త:

న్యాయవాదిగా ఏడేళ్ళు అనుభవం గడించిన అనంతరం న్యాయ స్థానాలు న్యాయాధికారులుగా నియమితులైన వ్యక్తులు న్యాయవాదుల సంఘం లేదా బార్ అసోసియేషన్ కోటా క్రింద జిల్లా న్యాయమూర్తులుగా నియమించబడటా నికి అర్హులు అని సుప్రీం కోర్టు ధర్మాసనం ఓ కీలక తీర్పును వెలువరించింది. న్యాయవాదుల కొరకే ఉన్న ప్రత్యేక నియామక ప్రక్రియ క్రింద జుడీషియల్ అ ధికారులు జిల్లా న్యాయమూర్తులుగా నియమితులు కావచ్చని భారత అత్యున్న త న్యాయ స్థాన జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ అ రవింద కుమార్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూ డిన ధర్మాసనం వెల్లడించింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని హైకోర్టులతో సంప్రదించి 3 నెలల్లోగా ఈ తీర్పునకు అనుగుణంగా నిబంధనలను సవరించా లని కూడా ధర్మాసనం సుస్పష్టం చేసింది. ఈ సందర్భంగా న్యాయాధికారులు బార్ కోటా క్రింద దరఖాస్తు చేసుకోకుండా అడ్డుకున్న ముగ్గురు న్యాయమూర్తు ల ధర్మాసనం ధీరజ్ మోర్ వ్యాజ్యములో 2020 సంవత్సరములో ఇచ్చిన తీ ర్పును ఈ సందర్భంగా ధర్మాసనం కొట్టివేసింది. కొన్నేళ్ళ పాటు న్యాయవాదు లుగా ప్రాక్టీస్ చేశాక న్యాయాధికారులుగా నియమితులయ్యే సివిల్ జడ్జిలు కూ డా న్యాయవాద సంఘాల కోటా క్రింద జిల్లా జడ్జిల నియామక పరీక్షకు హాజ రయ్యే అనుమతి కల్పించాలంటూ సుప్రీం కోర్టులో 30కి పైగా పిటీషన్లు దాఖలయ్యాయి. ఆ పిటీషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం జిల్లా జడ్జిల ని యామకాన్ని నిర్దేశించే 233 రాజ్యాంగ అధికరణపై వచ్చిన వ్యాఖ్యానాలను పరిశీలించి జిల్లా న్యాయమూర్తిగా నియామకానికి అర్హతను దరఖాస్తు సమ యములోనే చూడాలని పేర్కొంది. "న్యాయ సేవల వ్యవస్థలో వున్న వ్యక్తి మరి యు న్యాయవాదిగా లేదా జుడీషియల్ అధికారిగా 7 సంవత్సరములు లేదా అంత కంటే ఎక్కువ అనుభవం వున్న వ్యక్తి రాజ్యాంగంలోని ఆర్టికల్-233 ప్రకారం జిల్లా న్యాయమూర్తి, అదనపు జిల్లా న్యాయమూర్తిగా నియమించబ డటానికి అర్హులు" అని ధర్మాసనం వెల్లడించింది. అటువంటి నియామకాలలో న్యాయవాదులు మరియు న్యాయాధికారుల యొక్క కనీస వయసు దరఖాస్తు తేదీ నాటికి 35 సంవత్సరములు ఉండాలని ధర్మాసనం తెలుపుతూ ఈ నా లుగు అంశాలను ధర్మాసనం పరిశీలించి ఈ తీర్పును వెలువరించింది. 1) సబా ర్డినేట్ జుడిషియల్ సర్వీసుల కొరకు నియమించబడి బార్‌లో ఇప్పటికే 7 సం వత్సరములు అనుభవం పూర్తి చేసిన జుడిషియల్ అధికారి బార్ ఖాళీకి అదన పు జిల్లా న్యాయమూర్తిగా నియామకానికి అర్హులా?, 2) జిల్లా న్యాయమూర్తిగా నియామకానికి అర్హతను నియామక సమయములో మాత్రమే చూడాలా? లేదా? దరఖాస్తు సమయములో చూడాలా? లేదా? లేక రెండింటిలోనూ చూ డాలా?, 3) భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-233(2) ప్రకారం కేంద్ర లేదా రాష్ట్ర న్యాయ సేవ వ్యవస్థలో ఉన్న వ్యక్తికి జిల్లా న్యాయమూర్తిగా నియమిం చబడటానికి ఏదైనా అర్హత నిర్దేశింపబడినదా?, 4) 7 సంవత్సరముల పాటు సివిల్ జడ్జిగా వున్న వ్యక్తి లేదా 7 సంవత్సరములు లేదా 7 సంవత్సరముల కంటే ఎక్కువ కాలం న్యాయవాది మరియు సివిల్ జడ్జిగా వున్న వ్యక్తి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-233 ప్రకారం జిల్లా జడ్జిగా నియామకానికి అర్హుడా? అనే అంశాలను ధర్మాసనం పరిశీలించి తే.09-10-2025 దీన ఈ కీలక తీర్పును వెలువరించింది. (శీర్షిక రెజనీస్ కె.వి. ఎదిరి కె.దీప, సివిల్ అప్పీల్ నెం.3947/2020)

## పాఠశాల ఆవరణంలో రంగవల్లులు తీర్చిదిద్దిన విద్యార్థినిలు

బద్వేలు అర్బన్ జనవరి 10 ప్రభాతవార్త :

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి నెల్లూరు రోడ్డు ఆంజనేయనగర్‌లోని శ్రీ సర స్వతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ యందు సంక్రాంతి ముందస్తు ముగ్గుల పోటీలు అంగరంగ వైభవముగా నిర్వహించడం జరిగినది. ఈ ముగ్గుల పోటీల లో పాఠశాల విద్యార్థినులు చాలామంది విద్యార్థినిలు పాల్గొని రకరకాల రంగవ ల్లులను తీర్చిదిద్దారు, చిన్నారులు వేసిన రంగవల్లు పోటీలకు అతిథులైనటు వంటి పాఠశాల సలహాదారుడు రామ్మోహన్ రెడ్డి ,పాఠశాల ప్రిన్సిపల్ కాకా సుబ్రహ్మణ్యం యాదవ్ మరియు ఉపాధ్యాయ బృందము ఆధ్వర్యంలో నిర్వ హించడం జరిగినది. ఈ ముగ్గుల పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బ హుమతులు ప్రధానం చేయడం జరిగినది. ప్రథమ బహుమతి 8,వ తరగతి విద్యార్థినులు యు. విజయలక్ష్మి ఈ. మోనిక ద్వితీయ బహుమతి 9,వ తర గతి విద్యార్థినులు పి.లాస్య ఈ.శరణ్య తృతీయ బహుమతి కూడా 9,వ తర గతి విద్యార్థినులే ఈ.శ్రావణి వై.హైందవి మరియు వీరితోపాటుగా ముగ్గుల పో టీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థులకు కాన్సోలేషన్ బహుమతులను గౌరవ సల హాదారుడు రామ్మోహన్ రెడ్డి మరియు పాఠశాల ప్రిన్సిపల్ కాకా సుబ్రమ ణ్యం యాదవ్ విద్యార్థినులకు అందజేయడం జరిగినది. ఈ ముగ్గుల పోటీలను చుట్టుపక్కల ఉన్న పుర ప్రజలు వీక్షించి మరియు ఆనందించడం జరిగినది.



చివరిగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం అభినందించడం జరిగినది. సంక్రాంతి పండగ పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు సాంప్రదాయాలను ఉట్టిపడేలా ముందస్తు సంక్రాంతి వేడుకలు ని ర్వహించి ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులను అందజేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన రాయలసీమ నృత్యోత్సవాలు



ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 10 ప్రభాతవార్త

విద్యార్థులకు చదువుతో పాటు కళలు కూడా ముఖ్యమే అని డీఎస్పీ భావన పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో శ్రీనటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో శనివారం శివనర్తనహేల రాయలసీమ సంగీత నృత్యోత్సవాలు ఘనంగా ప్రా రంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరతనాట్యం, కూచి పూడి, జానపదనృత్యాలు వంటి కళలు కొందరికే అబ్బుతాయని వాటిని భావి తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వకలను ప్రోత్సహి స్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ఆర్కేవ్యాలీ త్రిపులఐటి డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్త మాట్లాడుతూ త్రిపులయిటిలో విద్యార్థులను శాస్త్రీయ నృ త్యాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. నటరాజ శళాక్షేత్రం నాట్య గురువు నాట్య విశారద మోహిద్దీన్ ఖాన్ మాట్లాడుతూ కళలు, కళాకారులను ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతో రెండవసారి ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. నాట్య గురువులకు శివకరకంకణ బిరుదు,చిన్నారులకు శివపాదమంజరి అవార్డులను అందించి జ్ఞాపిక, ప్రశంశా పత్రంతో సత్కరించారు. కాగా ఆదివారం కూడా రా యలసీమ నృత్యోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అర్పటవేముల హరినారాయణ, పలు ప్రాంతాలకు చెందిన నాట్యగురువులు, విద్యార్థుల తల్లిదండ్రులు. కళాకారులు, కళాబిమా నులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం



లక్కిరెడ్డిపల్లి జనవరి 10 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సోదరు డు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు శనివారం దిన్నెపాడు పంచాయతీలోని డి వడ్డేపల్లిలో 20 లక్షలతో సిమెంట్ రోడ్డును ఆయన భూమి పూజ చేశారు. సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరబడి త్రాగునీటితో ఇ బ్బంది పడుతున్న డి వడ్డేపల్లి బి ఎర్రగుడి పందేళ్ళపల్లి గ్రామాలకు తాగనీరు అందించామన్నారు. అంతే కాకుండా జల్జీవన్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్లు అందించే దిశలో ఉందన్నారు ఇప్పటికే లక్కిరె డ్డిపల్లి మండలంలో మూడు కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లు తారు రోడ్లు వేయించామన్నారు అనంతరం నరసింహారాజు గారి పల్లెలో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో ఆయన పాల్గొని పూజలు ని ర్వహించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదన మోహన్ సింగల్ గుండు అధ్యక్షుడు లక్ష్మి రారావు జు సర్పంచ్ లక్ష్మీనారాయణ చెరువు కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి టిడిపి సీనియర్ నాయకులు ధర్మ రాజు టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శంకరపు జయరాం టిడిపి సీని యర్ నాయకుడు పాపయ్య శ్రీకాంత్ రాజు నరసరాజు నాగరాజు టిడిపి మం డల తెలుగు యువత అధ్యక్షుడు పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థాన నిర్మాణాన్ని చేపడుతాం



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

చౌడేపల్లి, జనవరి 10 ప్రభాతవార్త

దురాక్రమిత స్థలంలో దేవస్థాన నిర్మాణాన్ని చేపట్టేందుకు సహకరించాలని కోరుతూ కాలనీ మహిళలు ఆందోళన చేపట్టారు. చౌడేపల్లి పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా వున్న బిసీ కాలనీలోని 54సర్వేనంబ రు నందు 6సెంట్ల స్థలముందనీ, దాన్ని కొందరు ఆక్రమించుకొనేందుకు ప్రయ త్నిస్తున్నారన్నారు. అయితే దాదాపు 50కుటుంబాలు నివసిస్తున్న కాలనీకి దేవ స్థానం లేదన్నారు. సదరు స్థలంలో వినాయక విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేశామనీ, కొందరు ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి తమకు దేవస్థానం నిర్మించుకొనేందుకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. కాలనీలోని ప్రజలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా వినాయక విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేస్తుండగా కొందరు అడ్డుకొన్నారని మ హిళలు వాపోయారు.

## శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాలకు
## ప్రతిష్టాత్మక ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు

మదనపల్లి, జనవరి 10 ప్రభాతవార్త.



శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశా ల విద్యా రంగంలో మరో మైలురాయిని అధిగమించిం ది. బయోటెక్నాలజీ విభాగం లో అత్యుత్తమ ప్రమాణాలు పాటించినందుకు గాను కళా శాలకు టాప్ బయోటెక్నాలజీ ఇన్స్టిట్యూట్ కోటాలో ఎడ్యు కేషన్ ఎక్సలెన్స్ అవార్డు ల భించింది. బెంగళూరులోని హెబ్బాల్‌లో ఉన్న హయత్ సెంట్రిక్ హోటల్‌లో ఈ అవార్డు ప్రధానోత్సవ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆ ఫీసర్ రాకేష్ కుమార్ సింగ్ చేతుల మీదుగా కళాశాల కరెస్పాండెంట్ రాటకొం డ గురుప్రసాద్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరె స్పాండెంట్ ఆర్. గురుప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకుల కృషి, విద్యార్థుల అంకితభావం వల్లే ఈ అవార్డు సాధ్యమైందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మదనపల్లి లాంటి ప్రాం తంలో ఉన్న కళాశాల కు జాతీయ స్థాయి గుర్తింపు పొందడం పట్ల పట్టణ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ రమ్య పాల్గొన్నారు.

## పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

సదుం జనవరి 10 ప్రభాతవార్త

సదుం పట్టణంలోని వినాయక పబ్లిక్ స్కూల్ మరియు డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా సదుం బట్టువా రి పల్లె పాఠశాలలో వేడుకలు జరిపించారు. విద్యార్థులకు ఆటలు, ముగ్గుల పో టీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రధానం అందజేశారు. భోగి మంట వేసి, రంగురంగుల ముగ్గుల వేసి కళాశాల ప్రాంగణం అంగరంగ వైభవంగా అలంకరించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమం లో పాల్గొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశేషాలను వి ద్యార్థులకు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఈ పండుగను చాలా వైభ వంగా జరుపుకుంటారని ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నదని, నాలుగు రో జులు పాటుజరిగే ఈ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ప్రాథ మిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ యార్డులో ముగ్గుల పోటీలు

పీలేరు జనవరి 10 ప్రభాతవార్త:

పట్టణంలో సోమవారం సంక్రాంతి పర్వదిన సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పీలేరు మేజర్ గ్రామపంచాయతీ ఈవో బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలు గువారి పండగలలో ప్రథమంగా వచ్చే సంక్రాంతి పర్వదిన పండుగ ముందు మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయడం జ రుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా పీలేరు మేజర్ గ్రామపంచా యతీ లోని అధికారులకు ప్రజలకు ప్రజాప్రతినిధులకు మీడియా ప్రతినిధులకు ఈ సందర్భంగా తెలిపారు.

## ముందస్తు సంక్రాంతి వేడుకలు



బద్వేలు అర్బన్, జనవరి 10, ప్రభాతవార్త

పట్టణంలోని రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు ఎం తో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలలో భాగంగా విద్యార్థు లకు ముగ్గుల పోటీలు, సాంస్కృతిక నృత్యాలు తదితర కార్యక్రమాలను అంగ రంగ వైభవంగా నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహు మతులు అందజేశారు. విద్యార్థుల ఉత్సాహం, వారి ప్రదర్శనలు అందరినీ ఆక ట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులను, విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ టి. రత్నం అభినందించారు. అలాగే వి ద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ జి. సుబ్బయ్య, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సరోజమ్మ, బ్యూలా, అనూష, లాల్ బూ, అంజలి, రాజ కు మారి, నాగలక్ష్మి, నాగ సుబ్బమ్మ, జిలాని, రజియా, హరిత, ఫార్వతి, నాగ య్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం



నందలూరు, జనవరి 10 ప్రభాతవార్త:

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆల యం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివ చ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న శ్రీ శక్తి పథకం ద్వారా మహిళ లకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో దూర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయానికి వచ్చిన భక్తులకు శ్రీ సౌ మ్యనాథ స్వామి సేవా ట్రస్టు అన్నదాన సదుపాయం కల్పించగా, మొక్కులు తీరిన భక్తులు 108 ప్రదక్షిణలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు ఎస్‌టియు

మైదుకూరు, జనవరి 10, ప్రభాతవార్త:

ఎస్ టి యు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారులు పద్మలత, నరహరి, ఎస్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఇలియాస్ భాష, బాలికల హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గంగా భవాని ముఖ్య అతిథు లుగా పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాలు రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల రెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి పాల కొండయ్య భోగిమంటలు ప్రా రంభించారు. అనంతరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఇలియాస్ భాష గాలి పటాలు ఎగిరేయగా ఉపాధ్యాయిని ఉపాద్యాయులు ఆనందాలతో, వారి పిల్లల కేరింతలతో పతంగులను గ్రౌండ్ ఆవరణంలో ఉత్సాహంగా జరిపారు. జిల్లా ఆ ర్థిక కార్యదర్శి సుబ్రమణ్యం పర్యవేక్షణలో ఉపాధ్యాయినిలు రంగవల్లుల పో టీలు ప్రారంభమయ్యాయి. వాటితోపాటు ఎస్ టి యు సీనియర్ నాయకులు జయరామయ్య, సురేష్ బాబు,రమణారెడ్డి తదితరులు పురుష పుంగవులచే టెంకాయ విసిరేసే పోటీలను ప్రారంభించారు. తదనంతర కార్యక్రమాల్లో భా గంగా ప్రధానోపాధ్యాయులు గంగా భవాని టెంకాయ కొట్టి మహిళామణుల కో లాటం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోలాటం కార్యక్రమం మంచి హుషారైన జాన పద గేయాలతో రసవత్తరంగా సాగింది. తదనంతరం పోటీలలో పాల్గొ న్నవారికి బహుమతుల ప్రదానం చేయడం జరిగింది. ముగ్గుల పోటీలలో ప్రథ మ బహుమతి కేశాలింగాయపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు సీఎస్ భవాని, ద్వితీయ బహుమతి తిప్పిరెడ్డిపల్లి ఉపాధ్యాయురాలు యి.లీలావతి, తృతీయ బహుమతి నంద్యాలంపేట పాఠశాల ఉపాధ్యాయురాలు కె. వరాలుదేవి గెలుపొందారు. పురుష ఉపాద్యాయుల టెంకాయ విసిరేసె పోటీలలో ప్రథమ బహుమతి యం. నాగరాజకుమార్, ద్వితీయ బహుమతి ఈ.ఈశ్వరయ్య, తృతీయ బహుమతి యం. గురుప్రతాప్ రెడ్డి గెలుపొందారు. ఈ కార్యక్రమం లో బహుమతుల దాతలు ఉదయగిరి రామచంద్ర, మధు సూదన రాజు, రమ ణమ్మ,జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వేంకటేశ్వర రాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సూర్యనారాయణ రెడ్డి, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిరణ్ కు మార్ ఈశ్వరయ్య, ఎస్ టి యు నాయకులు విజయుడు,మల్లేశ్వర రెడ్డి,నారా యణ ప్రసాద్, నాగరాజ కుమార్, మధు, మనోహర్, శ్రీదేవి, అపర్ణ, భారతి, సుధా, నీలావతి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయిని ఉపాద్యాయులు వారి కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



